క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.10,116 విరాళం



దాత ప్రసాదరావుకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఏసీ

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నానికి చెందిన ఎస్‌వీవీఎస్ ప్రసాదరావు–శైలజ దంపతులు శనివారం రూ.10,116 అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ఈవో, ఏసీ ముదునూరి సత్యనారాయణరాజుకు అందజేశారు. దాతను వేదపండితులు వేదాశీర్వచనం పలికి స్వామి చిత్రం పటం, ప్రసాదం అందజేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

పి.గన్నవరం: ఎయిడ్స్‌పై అందరూ అవగాహన కల్పించుకోవాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ జిల్లా సంస్థ జోనల్ సూపర్‌వైజర్ జి.శ్రీనివాసరావు అన్నారు. పి.గన్నవరంలోని గ్రేస్ కళాశాల విద్యార్థులకు శనివారం ఆయన ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ ఎలా వ్యాపిస్తుంది, వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలు తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ జిల్లా లింక్ వర్కర్ వై.శేషుకుమారి, గ్రేస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ నల్లి శ్రీచరణ్, ప్రిన్సిపల్ పీవీఆర్ నాయుడు, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారు జామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసి పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ



కేశనపల్లిలో బహుమతులు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

మలికిపురం: మండలంలోని కేశనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2023–24 ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన పి.సామ్యేల్ రాజు, కె.తనూషలకు నగదు, బహుమతులను శనివారం అందించారు. వరుసగా ప్రథమ బహుమతిగా రూ.మూడు వేలు, ద్వితీయ బహుమతిగా రూ.2 వేలు చొప్పున అందించారు. స్థానిక రిటైర్డ్ ఉపాధ్యాయుడు నల్లి పేరయ్య భార్య పేరిట ఏర్పాటు చేసిన నల్లి రాధా పరమేశ్వరి మెమోరియల్ ట్రస్ట్ పేరుమీద బహుమతి ప్రదానం చేశారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ మధుసూదనరావు చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. సమావేశంలో సర్పంచ్ యెనుముల నాగు, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొబ్బరి కార్మికుల హామీలు అమలు చేయాలి



ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు వినతిపత్రం అందిస్తున్న బొడ్డపల్లి

పి.గన్నవరం: కొబ్బరి దింపు, ఒలుపు కార్మికులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన పి.గన్నవరంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని నాగేశ్వరరావు ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు.

రెండు బైక్‌ల ఢీ: ముగ్గురికి గాయాలు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిరేవు వద్ద శనివారం ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. సఖినేటిపల్లిరేవు వద్ద నుంచి యాక్టివా బైక్‌పై మలికిపురం వైపునకు కేశనపల్లికి చెందిన ప్రదీప్, మలికిపురానికి చెందిన బాలు వస్తున్నారు. ఇదే మార్గంలో అదే సమయంలో సఖినేటిపల్లి వస్తున్న మరో బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. వీరిని తొలుత ఆటోలో మలికిపురం కేర్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

కలలు కల్లలేనా!



ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వేపై వరదల సమయంలో పాల క్యాన్లు తరలిస్తున్న వ్యాపారస్తులు (ఫైల్)



ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వేపై వరదల సమయంలో పడవపై వెళుతున్న ప్రజలు (ఫైల్)

- సమస్యల వలయంలో ముక్తేశ్వరం–అయినవిల్లిలంక కాజ్‌వే
- కాజ్‌వేపై వంతెన నిర్మాణం జరిగేదెన్నడో..
- వరదొస్తే 30 వేల మందికి ఇబ్బందులు

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం–అయినవిల్లిలంక ఎదురుబిడెం వద్ద కాజ్‌వే వరదల సమయంలో ముంపునకు గురవుతోంది. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే సమయానికి కాజ్‌వే పైకి మనిషిలోతు వచ్చి చేరుతోంది. ఇంక మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసే సమాయనికి లంక గ్రామాలు బాహ్య ప్రపంచం నుంచి సంబంధాలు తెగిపోతాయి. మండలంలోని అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, కపిలేశ్వరపురం మండలంలోని అద్దంకివారిలంకలకు చెందిన మూడు గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉంటాయి. వరదలకు కాజ్‌వే మునగడంతో ముప్పైవేలకు పైగా ప్రజలు నానా ఇబ్బందులు పడాల్సిన దుస్థితి. జూన్, జూలై, ఆగస్టు మూడు నెలలు వరదల వల్ల ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఇబ్బందులను గుర్తించిన లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి ఈ కాజ్‌వే పై వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. తదనంతరం ఆయన మృతితో ఆ ప్రతిపాదనలను అప్పటి పాలకులు గాలికొదిలేశారు. అయితే అప్పటి నుంచి ఈ ప్రతిపాదనలు ఏ మాత్రం ముందుకు సాగలేదు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాజ్‌వే వంతెనను నిర్మిస్తామని హామీ ఇవ్వడం పరిపాటిగా వస్తుంది. లంక గ్రామాల ఇబ్బందులు తీరుస్తామని ఓట్లు దండుకుని ఆనక ఆ మాటే మరచిపోతున్నారు. ఈ సారైన వంతెన నిర్మాణం పూర్తి చేసి లంక ప్రజలు ఇబ్బందులు తొలగిస్తారని లంక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వంతెన నిర్మాణం ఆవశ్యకత

ముక్తేశ్వరం–అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వేపై వంతెన నిర్మాణం ఆవశ్యకత ఎంతైనా ఉంది. లంక గ్రామాల్లో పండించిన వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు వరదల సమయంలో నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. లంక గ్రామాల్లో కూరగాయ, అరటి, మొక్కజొన్న, బొప్పాయి వంటి పంటలు పండిస్తారు. కొన్నిసార్లు అయితే వరద ప్రభావం రోజులు తరబడి ఉండటంతో వ్యవసాయ ఉత్పత్తులు పాడవుతున్నాయి. అలాగే లంక గ్రామాల్లో పాలను తరలించేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. సుమారుగా పదివేల పశువుల పైనే ఈ గ్రామాల్లో ఉన్నాయి. వీటి నుంచి ఉత్పత్తి అయిన పాలు సుమారుగా 30 వేల లీటర్ల పైనే. అయితే వరదల సమయంలో పాలను తరలించేందుకు పాడి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వరదల సమయంలో నిత్యావసరాలు తరలించేందుకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వరదల వల్ల వచ్చిన విషసర్పాల కాటుకు గురైన ప్రజలను, గర్భిణులను, అత్యవసర సేవలు అవసరమైన వ్యక్తులు సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. కాజ్‌వే పై వంతెన నిర్మాణంతో ఇటువంటి ఇబ్బందులు తొలగనున్నాయి.

వంతెనను నిర్మించాలి



ముక్తేశ్వరం–అయినవిల్లిలంక ఎదురుబిడెం వద్ద కాజ్‌వే వరదల సమయంలో మూడు లంక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాజ్‌వే పై వంతెన నిర్మాణంతో లంక ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయి. వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.

– జగదం శేషు, అయినవిల్లిలంక

నిధులు మంజూరు చేయాలి



కాజ్‌వేపై వంతెన ప్రతిపాదన కార్యరూపంలోకి తీసుకురావాలి. వరదల సమయంలో లంక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మూడు గ్రామాల్లోని ముప్పైవేల మంది పైచిలుకు ప్రజలకు వరద వల్ల కలిగే కష్టాలు తొలగుతాయి.

– మిండగుదిటి రాంబాబు, అయినవిల్లిలంక

ప్రతిపాదనలు పంపించాం



రూ.15 కోట్లతో కాజ్‌వేపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలను పంపించాం. ఉన్నతాధికారుల అనుమతి, నిధుల మంజూరు కాగానే వంతెన నిర్మాణ పనులు సత్వరమే ప్రారంభిస్తాం.

– టీఎస్‌వీ రమేష్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఆర్‌అండ్‌బీ

పారదర్శకంగా సబ్ రిజిస్ట్రార్ సేవలు

మలికిపురం: జిల్లాలో పారదర్శకంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సేవలు ఉంటాయని జిల్లా రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు పేర్కొన్నారు. మలికిపురం సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంట్ నల్లి ప్రకాష్ ఉత్తమ ఉద్యోగ అవార్డు అందుకున్న సందర్భంగా శనివారం కార్యాలయంలో సన్మానం జరిగింది. ఈ సన్మాన సభలో జిల్లా రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు పాల్గొని ప్రకాష్‌ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సబ్ రిజిస్ట్రార్ ఎంవీ సుధారాణి, కార్యాలయ సిబ్బంది, దస్తావేజు లేఖర్లు పాల్గొన్నారు.

రాజోలు సీఐగా నరేష్‌కుమార్



రాజోలు: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ)గా టీవీ నరేష్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇంటలిజెన్స్ విభాగం నుంచి రాజోలు సీఐగా పోస్టింగ్ లభించింది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నరేష్ కుమార్‌ను రాజోలు, నగరం, మలికిపురం, సఖినేటిపల్లి ఎస్సైలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటామన్నారు. రాజోలు ప్రాంతానికి సీఐగా రావడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

గొల్లపాలెం ఎస్‌ఎంసీ ఎన్నిక



గొల్లపాలెం ఎస్‌ఎంసీతో ఎంఈఓ విజయశ్రీ

మలికిపురం: మండలంలోని గొల్లపాలెం మండల ప్రజా పరిషత్ స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ) చైర్‌పర్సన్‌గా వైఎస్సార్ సీపీకి చెందిన చింతా సుశీల, వైస్ చైర్‌పర్సన్‌గా దొంగ నాగమణి, ఎన్నికయ్యారు ఎంఈవో ఎం.విజయశ్రీ పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి. ఎన్నికైన కమిటీ సభ్యులను ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుండుమేను నారాయణ మూర్తి, కందుల విజయ్‌కుమార్, గుండుమేను శ్రీనివాస్ యాదవ్, గుండుమేను వెంకట సత్యనారాయణ, నల్లి బన్ను, వడ్డి చిన్న తదితరులు అభినందించారు.

ఉత్తమ సేవలకు ప్రభుత్వ గుర్తింపు



వీఏహెచ్ బీర రమేష్‌ను సత్కరిస్తున్న జేడీహెచ్ మూర్తి

కొత్తపేట: ప్రభుత్వ శాఖల్లో చిత్తశుద్ధితో పనిచేసే ప్రతి ఒక్కరికీ ప్రజల నుంచి, ప్రభుత్వం నుంచి తగిన గుర్తింపు లభిస్తుందని జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ కెర్నడి మూర్తి అన్నారు. మండల పరిధిలోని వాడపాలెం గ్రామ సేవా కేంద్రంలో పశుసంవర్ధక సహాయకుడిగా పనిచేస్తున్న బీర రమేష్ ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రమేష్‌ను శాఖ జిల్లా అధికారి డాక్టర్ మూర్తి శాలువాతో సత్కరించారు. అలాగే ఆ శాఖ ఏడీ, స్థానిక ఏరియా పశువైద్యాధికారి సీహెచ్ వెంకటనారాయణ, మండల పశువైద్యాధికారి ఎస్.రేవంత్‌కుమార్, మండలంలో పశువైద్యాధికారులు, సిబ్బంది అవార్డు గ్రహీత రమేష్‌ను అభినందించారు.

రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు



రహదారిని పరిశీలిస్తున్న అధికారుల బృందం

అంబాజీపేట: మాచవరంలోని భేతాళ స్వామి ఆలయం నుంచి కోశి వారి అగ్రహారం మూడు తూముల వరకు అధ్వానంగా ఉన్న రోడ్డును పీఆర్ అధికారుల బృందం శనివారం పరిశీలించింది. రోడ్డు అభివృద్ధికి నోచుకుని 20 ఏళ్లు అయిందని, అప్పటి నుంచి ఈ రోడ్డు అభివృద్ధిని గాలికి వదిలేశారంటూ పే బేక్ టు ది సొసైటీ ఆర్గనైజేషన్ ఇటీవల ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో అధికారుల బృందంతో పాటు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు ఆ రహదారిని పరిశీలించారు. రోడ్డు అభివృద్ధితో పాటు మూడు కల్వర్టుల నిర్మాణానికి రూ.కోటి వ్యయం అయ్యే ప్రతిపాదనలు రూపొందించామని అధికారుతు తెలిపారు. వీటిని ఉన్నతాధికారులతో పాటు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మట్టపర్తి వెంకటేశ్వరరావు, స్థానికులు ఆదుర్తి నారాయణమూర్తి, ముత్యాల సత్తిబాబు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల అదృశ్యం: వేర్వేరు కేసుల నమోదు

పి.గన్నవరం: మండలంలో వేర్వేరుగా ఇద్దరు వ్యక్తులు ఇంటి నుంచి అదృశ్యమైన ఘటనలపై పి.గన్నవరం పోలీసులు శనివారం కేసులు నమోదు చేశారు. బెల్లంపూడి గ్రామానికి చెందిన 46 ఏళ్ల ఆదిమూలం సూరిబాబు పాత ఇనుము వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో ఈనెల 8న పాత ఇనుము వ్యాపారం నిమిత్తం రాజోలు ప్రాంతం వైపు వెళ్లాడు. అతడు ఇంటికి తిరిగి రాకపోవడంతో పరిసర ప్రాంతాలు గాలించారు. అయినప్పటికీ అతడి ఆచూకీ తెలియక పోవడంతో మేనల్లుడు వెంకట సాయి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. అలాగే ఎల్.గన్నవరం గ్రామానికి చెందిన పెదపూడి దుర్గా ప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య ఇటీవల మనస్పర్థలు ఏర్పడ్డాయని ఏఎస్సై పట్టాభిరామయ్య తెలిపారు. దీంతో ఇటీవల భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం అతడు ఉత్తరం రాసి ఇంటి నుంచి వెళ్లిపోయాడన్నారు. దుర్గా ప్రసాద్ తల్లి అనంతకుమారి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై వివరించారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం



రామేశ్వరంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న సీఎంవో సుబ్రహ్మణ్యం

సఖినేటిపల్లి: రామేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం రాజోలు నియోజకవర్గ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. విజిట్ ఆఫీసర్‌గా జిల్లా సమగ్ర శిక్ష సీఎంవో బొరుసు సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. కాంప్లెక్స్ నిర్వహణపై సమీక్షించారు. కాంప్లెక్స్‌కు హాజరైన ఉపాధ్యాయులు మోడల్ లెస్సన్స్ చెప్పడం, విద్యాప్రమాణాల పెంపు తదితర వాటిపై సీఎంవో సమీక్షించారు. క్రీడల్లో జరుగుతున్న మార్పుల గురించి, క్రీడాంశాల్లోని టెక్నిక్స్‌పై, సెప్టెంబర్‌లో స్కూల్ గేమ్స్ ఎంపికపై కూడా శిక్షణ ఇచ్చారు. ఎంఈవోలు డి.కిషోర్‌కుమార్, మద్దాలి వెంకటేశ్వరరావు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యేకు వినతి

మామిడికుదురు: పాశర్లపూడిలంకలో రహదారులు పాడైపోయాయని వాటిని అభివృద్ధి చేయడంతో పాటు గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు సహకారం అందించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను గ్రామ సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు కోరారు. పాశర్లపూడిలంకలో శనివారం సర్పంచ్‌తో పాటు స్థానికులు ఎమ్మెల్యేను కలసి పలు సమస్యలను ప్రస్తావించారు. ఓఎన్జీసీ కార్యకలాపాలు, భారీ వాహనాల రాకపోకల వల్ల రోడ్లు పాడైపోయాయని, ఓఎన్జీసీ అధికారులతో మాట్లాడి గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే సత్యనారాయణ స్థానికులకు అభయం ఇచ్చారు.



మామిడికుదురులో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



మలికిపురం కళాశాలలో కొవ్వొత్తుల ప్రదర్శన



పి.గన్నవరంలో వైద్య సిబ్బంది నిరసన ప్రదర్శన



సఖినేటిపల్లిలో తహసీల్దార్ నాగలక్ష్మమ్మకు వినతి పత్రం ఇస్తున్న వైద్యులు



అంబాజీపేటలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

విధులు బహిష్కరించిన వైద్య సిబ్బంది

- కోల్‌కతా ఘటనకు నిరసనగా..
- బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలి
- దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్



కొత్తపేటలో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది



చొప్పెల్లలో నిరసన తెలుపుతున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

కొత్తపేట: కోల్‌కతా ఆర్జీ కర్ ప్రభుత్వ కళాశాల ఆస్పత్రిలో రాత్రి సమయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ కొత్తపేటలో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, సిబ్బంది రోడ్డెక్కారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపు మేరకు శనివారం అత్యవసర వైద్య సేవలు మినహాయించి, ఓపీ, ఇతర వైద్య సేవలు నిలిపివేసి, నిరసన బాట పట్టారు. ఐఎంఏ కొత్తపేట, రావులపాలెం బ్రాంచ్, వీవీపీ స్థానిక సీహెచ్‌సీ, వానపల్లి, అవిడి పీహెచ్‌సీల ఆధ్వర్యంలో మహిళా డాక్టర్‌పై దాడిని ఖండిస్తూ నిరసన, ర్యాలీ, మానవహారం కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తపేట, రావులపాలెం ప్రైవేట్ వైద్యులు, సిబ్బంది స్థానిక డాక్టర్ చిన్నంరాజు ఆస్పత్రికి చేరుకుని అక్కడి నుంచి ర్యాలీగా పాతబస్టాండ్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి అందరూ కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ అడబాల వెంకటేశ్వరరావుకు, అక్కడి నుంచి రెవెన్యూ డివిజనల్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ఆర్‌డీఓ జీవీవీ సత్యనారాయణకు మెమోరాండం సమర్పించారు. కార్యక్రమంలో వైద్యులైన ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్లు కె.శేషుబాబు, కె.వీరారెడ్డి, సభ్యులు ఎం.గంగిరెడ్డి, మెంటే ఉదయభాస్కరరావు, భీమారెడ్డి, దుర్గావతి, ప్రదీప్తికరుణ, రమేష్‌రెడ్డి, అనూష తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: కోల్‌కతాలో జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ నగరం, లూటుకుర్రు పీహెచ్‌సీ ఉద్యోగులు మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బస్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. దోషులను శిక్షించాలని, మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. పీహెచ్‌సీ వైద్యులు స్వర్ణలత, రమ్యశైలజ, సీహెచ్‌ఓ సత్యవతి, పీహెచ్‌ఎన్ నారాయణమ్మ, సూపర్‌వైజర్లు, ఫార్మసిస్టులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మలికిపురం: ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులు మలికిపురంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు నక్క రమేష్‌బాబు, కొమరగిరి విజయకుమార్, వలంటీర్లు పాల్గొన్నారు. మండలంలోని లక్కవరం పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. దోషులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యులు పావని, ఎంపీహెచ్ చంటి, ఎంపీహెచ్ఎస్ నరసింహారావు, సిబ్బంది మరియమ్మ తదితరులు పాల్గొని తహసీల్దారు, పోలీస్, ఎంపీడీఓలకు వినతి పత్రాలు ఇచ్చారు.

పి.గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి మూడు రోడ్ల సెంటర్ వరకూ నిరసన ప్రదర్శన జరిగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని, మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఆందోళనలో నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారులు రియా, జాసిమ్, ఎంపీహెచ్ఓ శ్రీనివాసరెడ్డి, సూపర్‌వైజర్ బళ్ల వీవీఎస్ఎన్ మూర్తి, పీహెచ్ఎన్ దుర్గాబాయి, హెచ్‌వీ సీహెచ్ మరియమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: సఖినేటిపల్లి, రామేశ్వరం, మోరి పీహెచ్‌సీ వైద్యాధికారులు, స్థానిక తహసీల్దారు సీహెచ్ నాగలక్ష్మమ్మకు వినతి పత్రం అందజేశారు. అంతకుముందు కార్యాలయం వద్ద వారంతో నిరసన మానవహారం నిర్వహించారు. దోషులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు. వైద్యాధికారులు ఎండీ యునుస్, ఎ.పూర్ణచంద్రకుమార్, సీహెచ్ దుర్గ కావ్య, శామ్యూల్ ప్రవీణ్, పీహెచ్‌సీల సూపర్‌వైజర్స్, స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

అంబాజీపేట: అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీ ఉద్యోగులు శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబాజీపేట పీహెచ్‌సీ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవ హారంగా ఏర్పడి మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలని, ఈ ఘాతుకానికి పాల్పడిన దోషులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డాక్టర్లు శ్రీనివాస్, ఇంద్రావతి, సూర్య నగేష్, గీతాంజలి, సూపర్‌వైజర్లు, ఫార్మాసిస్టులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అయినవిల్లి: అయినవిల్లి, వీరవల్లిపాలెం పీహెచ్‌సీ వైద్యులు బి.మంగాదేవి సంతోష్‌కుమార్, విజయ్, సౌజన్యల ఆధ్వర్యంలో ముక్తేశ్వరం సెంటర్‌లో శనివారం మానవహారం పాటించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ పి.ప్రసాదరావు, ఆస్పత్రి సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: తాటిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఆరోగ్య సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. తాటిపాక పీహెచ్‌సీ నుంచి తాటిపాక సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి ఆందోళన చేపట్టారు. రాజోలు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సూపర్ వైజర్లు మద్దాల శ్రీనివాసరావు, హెచ్‌వీలు జయకుమారి, సుజాత, ఫార్మసిస్ట్ సుబ్రహ్మణ్యం, త్రినాథ్, మేల్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

ఆలమూరు: మహిళ వైద్యురాలిని లైంగిక దాడి చేసి హత్య చేసిన సంఘటనపై మండలంలోని ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రితో పాటు పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య సిబ్బంది తమ నిరసనలు తెలియజేశారు. వైద్యాధికారులు వి.గోపీరామ్, పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి ఆధ్వర్యంలో శనివారం హత్య సంఘటనకు వ్యతిరేకిస్తూ ప్లకార్డులు చేతబూని భారీ ర్యాలీలు నిర్వహించి తమ నిరసనలు తెలియజేశారు. వైద్యాధికారులు ఆర్.మల్లికార్జున్, డి.సాయికిషోర్, సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈలు బి.సూర్యనారాయణ ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి, ల్యాబ్ టెక్నీషియన్ ఆర్.రాజా రమేష్‌కుమార్ పాల్గొన్నారు.


రావులపాలెం: ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లకు ప్రజలు, ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని వైద్యులు కోరారు.



తాటిపాకలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది



ముక్తేశ్వరంలో నిరసన తెలుపుతున్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది



రావులపాలెం పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం సమర్పిస్తున్న వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది